చక్కటి దరహాసం కాదంత కష్టం!

- రేపు ప్రోస్టో డెంటిక్స్ డే
- దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు
- జీజీహెచ్‌లో కాస్మోటిక్ వైద్యసేవలు



గుంటూరు మెడికల్: మనిషి జీవించాలంటే గాలి, నీరు తరువాత ఆహారం తప్పనిసరి. ఆహారాన్ని నోటి ద్వారా దంతాలతో నమిలి తీసుకుంటాం. దంతాలు ఆహారం తీసుకునేందుకు సహకరించకపోతే ఆ బాధ వర్ణించటం కష్టం. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన ప్రజానీకం ముఖ్యంగా నగరంలోని ప్రజలు తీవ్ర దంత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోవడం, కొద్దిపాటి సమస్య ఉన్నప్పుడు పట్టించుకోకపోవడంతో దంత సమస్యలు పెద్దవిగా మారుతున్నాయి. జనాభాలో నూటికి 90 శాతం మంది తమ జీవిత కాలంలో ఏదోక సమయంలో దంత సమస్యల బారిన పడుతుంటారు. ఈ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, దంత వైద్యంలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులను ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి ఏడాది జనవరి 22న వరల్డ్ ప్రోస్టోడెంటిక్స్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కాస్మోటిక్ వైద్య పద్ధతులు..

ఒకప్పుడు పన్ను పుచ్చిపోతే పీకి వేయడం తప్ప, వేరే ఆలోచన ఉండేదికాదు. నేడు దంత వైద్యశాస్త్రం (డెంటిస్ట్రీ) బాగా అభివృద్ధి చెందడంతో పూర్తిగా పాడైన పళ్లను సైతం పీకే పనిలేకుండా మరమ్మతులు చేసి సాధారణ దంతంలాగా తయారు చేస్తున్నారు. కృత్రిమ పళ్ల అచ్చం సహజమైన దంతాల మాదిరిగానే కనిపించేలా సైతం అందంగా అమర్చుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో దంతాలు కోల్పోయిన వారికి కృత్రిమ పళ్లసెట్స్‌తో ఏ మాత్రం ఇబ్బంది లేకుండా సాధారణ జీవనం గడిపేలా చేస్తున్నారు. నేడు పన్ను పీకకుండా రూట్‌కెనాల్ చికిత్స అందుబాటులో ఉంది. పుచ్చిపోయిన పంటిని శుభ్రం చేసి అందులో సిమెంటమ్, సిల్వర్ మెటల్‌ను పెట్టి నొప్పి తగ్గించే విధానం అందుబాటులో ఉంది. పాచిపట్టిన, గారపట్టిన పళ్లను స్కేలింగ్ ద్వార శుభ్రం చేస్తున్నారు. కదిలిన, అరిగిన పళ్లకు, చిగుళ్ల సమస్యకు ఫ్లాప్ సర్జరీ, పళ్లు లేని వారికి (ఊడిపోయినవారికి) ఇంప్లాంట్స్ సహాయంతో ఫిక్స్‌డ్ పళ్లు, షుగర్ వల్ల దంతాలు ఊడిపోతున్నవారికి బేసల్ ఇంప్లాంట్స్ ద్వారా ఫిక్స్‌డ్ పళ్లు, ఎత్తు పళ్లు, వంకర పళ్లు ఉన్నవారికి కాస్మోటిక్ బ్రైసెస్‌తో ఆర్థో ట్రీట్‌మెంట్ సేవలు ఉన్నాయి. చిన్న పిల్లలకు పళ్లు పుచ్చిపోకుండా, ఎగుడుదిగుడుగా లేకుండా పళ్ల వరుస అందంగా ఉండేలా పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్ నేడు అందుబాటులో ఉంది. సాధారణ చికిత్సల మాదిరిగా దంత వైద్యంలో సైతం కాస్మోటిక్ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ముఖారవిందం పాడవకుండా చిరునవ్వులు చెరిగిపోకుండా దంతాలను అందంగా అమర్చుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు..

గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 40 నుంచి 50 మంది వివిధ రకాల దంత సమస్యలతో వస్తున్నారు. పుచ్చిపోయిన దంతాలను సిమెంటమ్‌తో ఫిల్ చేయడం, బాగా పుచ్చిపోయిన దంతాలను కొద్దిపాటి మత్తు ఇచ్చి పీకివేయడం, గారపట్టిన దంతాలను క్లీనింగ్ చేయడం వంటివి చేస్తున్నారు. పెద్దాసుపత్రిలో స్పెషాలిటీ వైద్యనిపుణులు అందుబాటులో ఉండటంతో అత్యాధునిక దంత శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. సాధారణ దంత వైద్యసేవలతోపాటు, ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నారు.

దంత వైద్యంపై అవగాహన పెరిగింది



ఒకప్పుడు దంత వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇళ్లలోనే వైద్యం చేసుకునేవారు. నేడు ప్రజలకు కొంత మేరకు దంత వైద్యంపై అవగాహన పెరిగింది. దంత వైద్యంలో కాస్మోటిక్ సేవలు రావడం, ప్రజలు దంత వైద్యంపై అవగాహన కలిగి ఉండటంతో దంత వైద్యులకు బాగా డిమాండ్ పెరిగింది. ఒక్కో వైద్యుడు ప్రతిరోజూ 15 నుంచి 20 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. పళ్లు కోల్పోయిన వారు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా కృత్రిమ దంతాల ద్వారా జీవితాన్ని హాయిగా గడిపివేయవచ్చు.

– డాక్టర్ చింతా వాసవి, దంత వైద్య నిపుణురాలు, గుంటూరు

దంత వైద్యంలో ఆధునిక చికిత్సలు..



దంత వైద్యంలో నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. డెంటల్ పీజీ స్పెషాలిటీ వైద్యసేవలకు నేడు బాగా డిమాండ్ ఉంది. ప్రతి ఒక్కరు దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే దంత వైద్యులను సంప్రదించటం ద్వారా పన్ను పూర్తిగా పాడవ్వకుండా వైద్యం అందించవచ్చు. పిల్లలకు తరచుగా దంత వైద్య సమస్యలు వస్తుంటాయి. వాటిని తల్లిదండ్రులు గమనించి దంత వైద్యులను సంప్రదించాలి. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలి. ఏదైనా ఆహారం తిన్న వెంటనే నీళ్లతో పుక్కిలించాలి.

– డాక్టర్ రేవూరి లక్ష్మి, దంత వైద్య నిపుణురాలు, గుంటూరు

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల కు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి ఆయా డిపార్ట్‌మెంట్ అధికారులకు స్పష్టం చేశారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో అదనపు కమిషనర్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలన్నారు. నగరంలోని ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉన్నాయని, వాటిలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై విద్యా శాఖ, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగులకు వీలుగా ర్యాంప్‌లు, టాయ్‌లెట్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల ఏర్పాటుపై ఎస్ఈతో కలిసి ఏఈఆర్‌ఓ, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఎస్ఈ (ఎఫ్ఏసీ) సుందరరామిరెడ్డి, ఈఈలు కొండారెడ్డి, శ్రీనివాస్, అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఎంఈఓలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్, డిప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు, డీఈఈలు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా



గుంటూరు ఎడ్యుకేషన్: చదువులో ప్రతిభావంతులుగా రాణిస్తున్న విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీపీ మనోహర్ తెలిపారు. శనివారం పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్థులు క్రీడా రంగంలో రాణించడం అభినందనీయమన్నారు. ఒక వైపు కుటుంబ పోషణకు పనిచేస్తూ, మరో వైపు క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భారతీయ జనతా మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రెండు కిలోమీటర్ల పరుగు పందెంలో బీఎస్సీ ప్రథమ సంవత్సర విద్యార్థి వి.ఈశ్వర్‌లాల్ నాయక్, ఎం.కామ్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బి.సత్యారాణి ప్రథమ స్థానంలో నిలిచి, బహుమతులు గెలుపొందినట్లు తెలిపారు. కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, తమ విద్యార్థులు నిరూపించారని తెలిపారు. వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గం



గౌరవ అధ్యక్షుడు కృష్ణానాయక్‌కు నియామక పత్రం అందజేస్తున్న కట్టా వెంకటేశ్వర్లు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గం శనివారం ఎన్నుకున్నారు. స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన సమావేశానికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సమితి గౌరవ అధ్యక్షులుగా రామావత్ కృష్ణానాయక్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కుందనాటి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా కాంద్రకొండ కోటయ్య, ఉపాధ్యక్షులుగా అమాస్ రాములు, సెక్రటరీగా తోకల నరసింహారావు, బడె నాగరాజు, ధారవత్ సాంబశివనాయక్, సంయుక్త కార్యదర్శి కేతావత్ బాలునాయక్, కుంభా కుమారస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండారెడ్డి శ్రీనివాస్, పసుపులేటి వరప్రసాద్, కావాడి శ్రీనివాసరావు, కోశాధికారిగా పోట్లూరి మోహన్‌రావులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల మధ్య ఐక్యత పెంపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

గుంటూరు డివిజన్ మీదుగా అయోధ్యకు ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం అయోధ్యకు ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07215 గుంటూరు– అయోధ్యధమ్ ప్రత్యేక రైలు ఈనెల 31వ తేదీన గుంటూరు రైల్వే స్టేషన్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలు దేరుతుందని తెలిపారు. అలాగే ఇదే రైలు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు అయోధ్య ధమ్ స్టేషన్ నుంచి గుంటూరుకు బయలు దేరుతుందని తెలిపారు.

రైళ్ల స్టాప్‌లు పొడిగింపు..

దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించిన ప్రత్యేక స్టాప్‌లను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు సీనియర్ డీసీయం దినేష్‌కుమార్ తెలిపారు. రైలు నంబర్ 17243, గుంటూరు– రాయగడ రైలు భీమడోలు స్టేషన్ మీదుగా, 17281 గుంటూరు– నరసాపూర్ రైలు పుట్లచెరువు మీదుగా, 12603 చెన్నై సెంట్రల్– హైదరాబాద్ రైలు నడికుడి, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా, 12733 తిరుపతి– లింగంపల్లి రైలు నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ మీదుగా, 17015 భువనేశ్వర్– సికింద్రబాద్ రైలు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా, 17232 నాగర్‌సోల్– నరసాపూర్ రైలు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా, 17625 కాచిగూడ– రేపల్లె రైలు వేజెండ్ల మీదుగా, 17216 ధర్మవరం– విజయవాడ రైలు గిద్దలూరు మీదుగా, 17256 లింగంపల్లి–నరసాపూర్ రైలు మంగళగిరి మీదు గా, 17643 చంగల్‌పట్టు– కాకినాడ పోర్ట్ రైలు మంగళగిరి స్టేషన్ మీదుగా, 17216 ధర్మవరం– విజయవాడ రైలు మాల్కాపురం రోడ్డు మీదుగా, 17255 నరసాపూర్– హైదరాబాద్ రైలు నల్గొండ స్టేషన్ మీదుగా, 17643 చంగల్‌పట్టు– కాకినాడపోర్టు రైలు న్యూ గుంటూరు స్టేషన్ మీదుగా, 17212 యశ్వంత్‌పూర్– మచిలీపట్నం రైలు కంభం స్టేషన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

విద్యుత్ పొదుపుగా వాడుకోవాలి

పెదనందిపాడు: ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, అవసరం ఉన్నంత మేరకే వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ బి.వీరాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో సబ్‌స్టేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

పంచాయతీలకు నిధుల జమపై సీఎంకు ధన్యవాదాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

పాత గుంటూరు: రాష్ట్రవ్యాప్తంగా 2022 –23 ఆర్థిక సంఘం నిధులు రూ.415 కోట్లను గ్రామ పంచాయతీ ఖాతాలకు జమ చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ధన్యవాదాలు తెలిపారు. శనివారం అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామపంచాయతీలకు రూ.41 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సర్పంచులకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా రూ.20 లక్షలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్థిక సంఘం నిధులు కూడా మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సంఘ జిల్లా అధ్యక్షులు ముప్పాళ్ళ మనోహర్, సర్పంచులు సూర్య ప్రకాష్, ఎన్.లలిత కుమారి, మబ్బు శిరీష, తోకల సరోజినీ, ఏరువా జగన్ మోహన్ రెడ్డి, వెదురుపాక వెంకట్, చుండు వెంకట రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణతో నెరవేరిన సీఎం జగన్ సంకల్పం

వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలోనే అతి పెద్దదైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సమతా సంకల్పాన్ని నెరవేర్చారని అవర్ స్టేట్ అవర్ లీడర్ – వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి పేర్కొన్నారు. శనివారం అమరావతిరోడ్డులోని ఫోరం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చారిత్రక ఘట్టమని, చరిత్రలో మరపురాని రోజుగా నిలిచిపోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీతో ఘనవిజయం సాధించడం రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరమన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించేందుకు మరోసారి వైఎస్సార్ సీపీ విజయం చారిత్రక అవసరమన్నారు. ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అపోహలను తొలగించడంలో అందరూ కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో జీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ అజయ్ కిషోర్, ఇండియన్ బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీనివాసు, వెంకటరమణారెడ్డి, డి.తిరుపతిరెడ్డి, పి.గౌరీ శిరీష, ఫణిదీపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ సంగీతం అభివృద్ధికి కృషి



యువ పురస్కారంతో సత్కారం

నగరంపాలెం: సాంప్రదాయ సంగీతం అభివృద్ధికి నిరంతర కృషి చేయడం అభినందనీయమని న్యాయవాది జూపూడి వెంకటకుమార్‌యజ్ఞదత్ అన్నారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై సంగీత సభ జరిగింది. విశ్రాంత లెక్చరర్ తులశమ్మ, వైద్యురాలు జి.సీలిమజ్యోతి జ్యోతి ప్రకాశనంతో సభను ప్రారంభించగా, డాక్టర్ పి.విజయ సభాధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యఅతిథి వెంకటకుమార్‌యజ్ఞదత్ మాట్లాడుతూ యువతను సంస్థ ప్రోత్సహించడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం విదుషి వ్యాకరణం గాయత్రీ విభావరికి గాయత్రీ యువ సంగీత రత్న బిరుదు– యువ పురస్కారంతో సత్కరించారు. వ్యాకరణం గాయత్రీ విభావరి వాయులీన సోలో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించగా, మృదంగంపై విద్వాన్ ఎస్.హరిహరన్ (చెన్నై) చక్కటి వాయిద్యాన్ని అందించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షురాలు పాటిబండ్ల లలిత, మాధవపెద్ది విజయలక్ష్మి, కార్యదర్శి ఎ.మంగాదేవి, ఉప కార్యదర్శి మాధవీకృష్ణ పాల్గొనగా, అతిథులు, కళాకారులను సత్కరించారు.

30, 31వ తేదీల్లో స్ఫూర్తి ది ఐ క్యూబ్ ఎక్స్‌పో

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈనెల 30, 31వ తేదీల్లో స్ఫూర్తి ది ఐ క్యూబ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. శనివారం అమరావతిరోడ్డులోని కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు దీటుగా తయారు చేసేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలను అనుసంధానం చేయడమే ముఖ్య ఉద్దేశంగా రెండు రోజుల పాటు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుంటూరు నగరంలోని వివిధ డిగ్రీ కళాశాలలు, ప్రముఖ ఆస్పత్రులతో పాటు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. ఎక్స్‌పోలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ఆయా సంస్థలు ఈనెల 23వ తేదీ సాయంత్రం లోపు 7013876153 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. స్ఫూర్తి కన్వీనర్ డాక్టర్ వి.చక్రవర్తి మాట్లాడుతూ రెండురోజులపాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రదర్శన జరగనున్నట్లు తెలిపారు. ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, సహాయాచార్యులు డి.కళ్యాణి, సీహెచ్ వైష్ణవి, వి.బాలాజీ, సీహెచ్ వేదవతి, ఎ.బాలాజీబాబు, వి.అభిలాష్, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, ఎన్.మణికంఠ, బి.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై తల్లిదండ్రుల ఆందోళన

గుంటూరు ఈస్ట్: బాలుడు మృతిచెందిన ఘటనపై తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందాడంటూ ఆరోపించారు. సేకరించిన సమాచారం మేరకు పేరేచర్ల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ కుమారుడు ఎనిమిది సంవత్సరాల అఖిల్ మూడు రోజుల క్రితం ఇంటి మేడపై గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. తల్లిదండ్రులు బాలుడిని జీజీహెచ్‌లోని పిల్లల విభాగంలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రులు వైద్యులను మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వైద్యులు స్కానింగ్ తీసి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కాని ఆపరేషన్‌ను వాయిదా వేశారు. అఖిల్ శుక్రవారం మృతిచెందగా, మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతిచెందాడని కిరణ్‌కుమార్ ఆరోపించాడు. అయితే న్యూరో సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ ఘటనపై వివరణ ఇస్తూ బాలుడికి పూర్తి స్థాయిలో వైద్యం అందించామన్నారు. ఆరోగ్యం నిలకడగా ఉన్న సమయంలోనే ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని నిర్ణయించామన్నారు. వైద్యుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

జీజీహెచ్‌కు స్టేషనరీ అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో దాతలు ముందుకు వచ్చి స్టేషనరీ అందిస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం జీజీహెచ్‌లో పనిచేసే స్టాఫ్ నర్సు వరలక్ష్మి తన స్నేహితుల ద్వారా స్టేషనరీని డాక్టర్ కిరణ్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి రోజుకు 3వేల మంది రోగులు వస్తుంటారని, వారి కోసం స్టేషనరీ అవసరం ఉందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం దాతలు ముందుకు వస్తున్నారని అలంటి వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హెడ్ నర్సులు కె.వరలక్ష్మి, కె.వెంకట సుబ్బమ్మ, బయో మెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ విజయ సంకల్పయాత్ర



బీజేపీ పథకాలను స్థానికులకు వివరిస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, వనమా నరేంద్ర కుమార్

గుంటూరు మెడికల్: బీజేపీ తూర్పు అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ విజయ సంకల్పయాత్ర జరిగింది. యాత్ర గుంటూరు నగరంలో శ్రీనగర్ 7వ లైను బుద్ధుడు బొమ్మ రోడ్డు, మహబూబ్‌నగర్ జెండా చెట్టు, శ్రీనగర్ 4,5,6 లైనులు, వల్లూరివారి తోట, మాలకొండయ్య కాలనీ నుంచి కాకుమాను వారితోట వరకు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చి ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచారన్నారు. భారత సంకల్ప యాత్ర దేశవ్యాప్తంగా వంద రోజులపాటు జరుగుతోందని వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతూ పాదయాత్ర చేస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, నాయకులు షేక్ రఫీ, కామరాజు గద్ద దుర్గాప్రసాద్, తిరుమల శెట్టి రామచంద్రరావు, మేరీ సరోజిని, చలపతిరావు, పాలాగోని చైతన్య, చంద్రశేఖర్, కామేపల్లి వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెదనందిపాడు: ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి తెలుసుకోవాలని వాటి గురించి తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని ఏఓ సుధారాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగులపాడు సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా

ఆర్డీ శోభారాణి సేవలు ఆదర్శనీయం



గుంటూరు మెడికల్: మూడో జోన్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ జి.శోభారాణి కృషి ఆదర్శనీయమని ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నాయకులు కొనియాడారు. శనివారం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కూరపాటి సత్యంరాజ్, బడుగు శివాజీ, ప్రశాంతి, కరుణకుమార్, సుజాత, చంద్రశేఖర్, హరికృష్ణ, తిరుపతిరావు, శివచంద్ర, గోపి తదితరులు ఆర్డీ కార్యాలయంలో డాక్టర్ జి.శోభారాణిని కలిసి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటూ, సమస్యలను పరిష్కరించడంలో ఆమె కృషి వెలకట్టలేనిదన్నారు. ఉద్యోగులందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కారానికి కృషి చేస్తుంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

గుంటూరు వెస్ట్: కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు మంచినీటి సమస్యలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిర సమీపంలో రూ.7 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు క్యాన్స్ ద్వారా ఇప్పటివరకు మంచి నీటి సరఫరా జరిగేదన్నారు. నూతన ప్లాంట్ ఏర్పాటుతో గంటకు 500 లీటర్ల మంచినీటిని పొందవచ్చన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజల మంచి నీటి సమస్యలు తొలగిపోతాయన్నారు. కలెక్టర్, జేసీలు నీటిని తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు, ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శనివారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ డాక్టర్ ఇ.మాధవి మాట్లాడుతూ 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం సామాజిక చైతన్యం' అనే అంశంపై ఫిబ్రవరి 14, 15 తేదీలలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, విభాగం అధ్యాపకులు ఆచార్య కృష్ణారావు, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయ్ కుమార్, తెలుగు విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణకు చర్యలు

గుంటూరు మెడికల్: పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శనివారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు నియంత్రణ లీగల్ అడ్వైజర్ పి.శివ శంకర మాట్లాడుతూ జాతీయ పొగాకు నియంత్రణ చట్టం కాట్పా–2003 అమలు చేశారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, నిషేధిత ప్రభు త్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ఆవరణలో ధూమపానం చేయడం, పొగాకు ఉత్పత్తుల విక్రయం వంటి వాటిపై జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు మాట్లాడుతూ పొగాకు, ఉత్పత్తులను వాడటం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా డీసీఎం నందిగం సురేష్, సైకాలజిస్ట్ జ్యోతి పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధి బాధిత విద్యార్థినికి ఆర్థికసాయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు నగరానికి చెందిన తెత్తురాజు స్వాతి అనే బీటెక్ విద్యార్థినికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయన్న విషయం వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి సహృదయంతో ఆమెకు సంవత్సరం పాటు వైద్య ఖర్చులు, టెస్టులకు అయ్యే రూ.73,200లను అరండల్‌పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో శనివారం అందచేశారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ సన్నిహితుల ద్వారా స్వాతి పరిస్థితి తెలిసిందని, చదువుకునే వయస్సులో కిడ్నీ వ్యాధి బారిన పడటం ఎంతో బాధాకరమైన విషయమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా స్వాతి చదువుకుంటూ ధైర్యంగా జీవించడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని అభినందించారు . భవిష్యత్‌లో ఇతర వైద్య ఖర్చులు, కిడ్నీ మార్పిడి సమయాల్లో కూడా ఆర్థికంగా చేయూతనందిస్తానని ధర్మచరణ్ హామీ ఇచ్చారు. స్వాతి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గుర్రాల రంగారావు, వడ్లమూడి రవి, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.